## క్లుప్తంగా

### బస్సులు రాలే..

ములకలపల్లి: బీఆర్ఎస్ రజతోత్సవ సభకు బయలుదేరిన పార్టీ శ్రేణులకు నిరాశే ఎదురైంది. మధ్యాహ్నం వరకూ ఎదురు చూసినా, బస్సులు రాకపోవడంతో నిరాశగా వెనుతిరిగి వెళ్లారు. సభకు పార్టీ శ్రేణులను తరలించేందుకు వివిధ పాఠశాలలకు చెందిన మూడు బస్సులను ములకలపల్లికి ఏర్పాటు చేసినట్లు పార్టీ అధినాయకత్వం తెలిసింది. దీంతో స్థానిక నాయకులు కార్యకర్తలను సిద్ధం చేశారు. ఉదయాన్నే మండలకేంద్రానికి చేరుకొని, తెలంగాణతల్లి విగ్రహానికి పూలమాల వేసి, ప్రయాణానికి సిద్ధమయ్యారు. ఎంతసేపటికీ బస్సులు రాకపోవడంతో, తిరిగి ఇళ్లకు వెళ్లారు. మరికొందరు సొంతఖర్చులతో మీటింగ్‌కు వెళ్లారు. కాంగ్రెస్ ప్రభుత్వం దురుద్దేశంతో పాఠశాలకు హుకుం జారీచేసి, బస్సులను రద్దు చేయించిందని పార్టీ మండల అధ్యక్షుడు మోరంపూడి అప్పారావు ఒక ప్రకటనలో ఆరోపించారు. మాజీ జెడ్పీటీసీ సున్నం నాగమణి, బండి కొమరయ్య, పుష్పాల చందర్‌రావు, బైటి రాము, సత్యనారాయణ, పుష్పాల సాయి, నర్సింహారావు, శేషు తదితరులు ఉన్నారు.

### దేశ ప్రజల కోసం పూజలు

దుమ్ముగూడెం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో అర్చకులు భారత దేశ ప్రజలు సుభిక్షంగా ఉండాలని, శత్రు దేశాలకు సద్బుద్ధి కలగాలని ఆకాంక్షిస్తూ ఆదివారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి నిరసనగా శ్రీ సీతారామ చంద్ర స్వామి వారి దేవస్థానం, పర్ణశాల ఉద్యోగులు పహల్గాం గ్రామంలో అమానవీయ మారణ కాండపై నిరసనగా ఉగ్రవాదం సమూలంగా నశించాలని పూజలు చేశారు. మూలవరులకు పంచామృతములతో అభిషేకం నిర్వహించి, ప్రత్యేకముగా సహస్ర నామార్చన, శ్రీ సంక్షేప రామాయణ పారాయణము, తదుపరి శ్రీ అంజనేయ స్వామివారికి అష్టోత్తర నామార్చన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌చార్జ్ అనిల్ కుమార్, అర్చకులు కారంపూడి కిరణ్ కుమార్ ఆచార్యులు, శ్రీరంగం వెంకటాచార్యులు, నలదీగల నరసింహచార్యులు, సిబ్బంది శివ, రాము, తులసి, శేఖర్, సురేష్, రాఘవులు, నవీన్, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### మంత్రి కోమటిరెడ్డికి ఎమ్మెల్యే జారే వినతి



మంత్రికి వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే..

అశ్వారావుపేటరూరల్: నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ కోరారు. ఈ మేరకు ఆదివారం హైదారాబాద్‌లోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో కలిసిన ఎమ్మెల్యే.. నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలు, అభివృద్ధి పనుల కోసం కావాల్సిన నిధులను మంజూరు చేయాలని వినతి చేశారు. దీంతో మంత్రి సానుకూలంగా స్పందించి, నిధులు మంజూరు చేసేందుకు కృషి చేస్తానని తెలిపినట్లు ఎమ్మెల్యే చెప్పారు.

### బాధిత కుటుంబాలకు వితరణ



బాధితులకు వితరణ అందించిన నాయకులు

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని పాలగుంపు గ్రామంలో ఈ నెల 13వ తేదీన జరిగిన అగ్ని ప్రమాదంలో నాలుగు ఇళ్లు కాలిపోగా, బాధిత కుటుంబాలు సర్వం కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ బాధిత కుటుంబాలకు ఆదివారం అశ్వారావుపేట నియోజకవర్గ టీడీపీ నాయకులు కట్రం స్వామిదొర ఆధ్వర్యంలో కుటుంబానికి 25 కిలోల బియ్యం, నిత్యావసరాలను అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నార్లపాటి శ్రీనివాస్, గొంది ప్రసాద్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

### బియ్యం అందజేత

మణుగూరురూరల్: మండలంలోని సంతోష్‌నగర్‌లో గల శ్రీవిద్యాభ్యాస పాఠశాలకు ఏలూరు జిల్లా గురువాయిగూడెం గ్రామానికి చెందిన కమ్మ వెంకటరత్నారావు-విమలమ్మ దంపతుల కుమార్తె మక్కిన రమేష్ భార్య యోజీ(యామిని) జ్ఞాపకార్థంగా ఆదివారం 50 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులను వితరణగా అందజేశారు. అనంతరం పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులకు సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సింగరేణి సేవా సమితి సభ్యులు ఎస్‌డి.నాసర్‌పాషా, సేవా సభ్యులు జమీలా బేగం, ఏ.మంగీలాల్, పాఠశాల నిర్వాహకులు బి.జగన్మోహన్‌రెడ్డి, కిరణ్‌కుమార్, ఉపాధ్యాయులు సుహాసిని దేవి, సిబ్బంది సుజాత, రాధ పాల్గొన్నారు.

# ఏజెన్సీలో వైద్యసేవలకు పెద్దపీట

- చొరవ తీసుకున్న కలెక్టర్లు, ఎమ్మెల్యే
- వడివడిగా సాగిన ఆస్పత్రి పనులు
- మరింత దృష్టి సారిస్తే మేలు



రూ.1.40 కోట్లతో చేపట్టిన పనులను పరిశీలిస్తున్న నాటి కలెక్టర్ అనుదీప్ (ఫైల్)



చర్ల సీహెచ్‌సీలో డైట్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ప్రస్తుత కలెక్టర్ జితేష్ వి.పాటిల్ (ఫైల్)



చర్లలోని డయాలసిస్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న బాధితులు

చర్ల: జిల్లాలో అత్యంత వెనకబడిన గిరిజన మారుమూల ప్రాంతమైన చర్లలో ప్రభుత్వ వైద్య సేవలనందించేందుకు నాటి జిల్లా కలెక్టర్ అనుదీప్ నాంది పలికితే.. నేటి ప్రస్తుత జిల్లా కలెక్టర్ జితేష్ వీ పాటిల్ ప్రభుత్వ వైద్య సేవలను మెరుగు పరచి ఏజెన్సీ వాసులకు మరింతగా చేరువ చేసేందుకు కంకణం కట్టుకున్నారు. నాటి నేటి జిల్లా కలెక్టర్ల సూచనలతో ప్రస్తుత జిల్లా వైద్య విధాన పరిషత్ డీసీహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు ఏజెన్సీ ప్రాంతంలో వైద్య సేవలను మరింతగా చొరవ తీసుకుంటున్నారు.

**కలెక్టర్లు, అధికారుల కృషి**

2022లో రాష్ట్రంలో సుమారు 80 ఆసుపత్రులు డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ నుంచి వైద్య విధాన పరిషత్‌లోకి మార్చగా జిల్లాలో ఇల్లెందు, బూర్గంపహాడ్ వైద్యశాలలతో పాటు చర్ల వైద్యశాల కూడా వైద్య విధాన పరిషత్‌లోకి వచ్చింది. చర్ల వైద్యశాలను వైద్య విధాన పరిషత్‌లోకి తీసుకువచ్చేందుకు డీసీహెచ్ఎస్ డాక్టర్ జి.రవిబాబు విశేషంగా కృషి చేశారు. కొంత కాలం క్రితం మండల కేంద్రంలో ఉన్న వైద్యశాలను చర్ల నుంచి నాలుగు కిలోమీటర్ల దూరంలో కొయ్యూరుకు తరలించగా ఇక్కడి ప్రజలు వైద్య సదుపాయం కోసం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రజలు పడుతున్న ఇబ్బందులను స్వయంగా తెలుసుకున్న నాటి జిల్లా కలెక్టర్ అనుదీప్ 2022లో మళ్లీ చర్ల మండల కేంద్రంలోనే పూర్తి స్థాయి వైద్య సేవలనందించేందుకు పూనుకున్నారు. ఈ క్రమంలో అప్పట్లో ఉన్న సీహెచ్‌సీ భవనాలకు మరమత్తులు, అదనపు గదుల ఏర్పాటు కోసం ఎస్‌సీపీ ఫండ్స్ నుంచి రూ.1 కోటి 40 లక్షలను కేటాయించి పనులు చేపట్టాలని వైద్య ఆరోగ్య శాఖ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. దీంతో సీమాంగ్ సెంటర్ భవనాల ఆధునికీకరణ, 40 పడకల సామర్థ్యం కలిగిన రెండు నూతన వార్డుల నిర్మాణం, రూ.15 లక్షలతో శవ పరీక్షా కేంద్రం నిర్మాణానికి అడుగులు పడ్డాయి. అటు తరువాత వైద్యశాల భవన నిర్మాణానికి నాటి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావును మెప్పించి భవన నిర్మాణానికి రూ.10 కోట్లు ప్రభుత్వం నుంచి మంజూరు చేయించేందుకు పావులు కదిపారు. చర్ల వైద్యశాలకు పూర్తి స్థాయి క్యాడర్ స్ట్రెంత్ మంజూరు కానప్పటికీ నాటి జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ప్రస్తుత డీసీహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు జిల్లాల్లోని వివిధ ప్రాంతాల నుంచి వైద్యులు, ఫార్మసీ, నర్సింగ్, ల్యాబ్ టెక్నీషియన్స్ ఆరోగ్యశ్రీ సేవల కోసం డిప్యుటేషన్ ద్వారా చర్ల ఆస్పత్రికి వైద్యులు, సిబ్బందిని నియమించారు.

**ఎమ్మెల్యే చొరవ..**

భద్రాచలం ఏజెన్సీ ప్రాంతానికి చెందిన గిరిజనుడు, ప్రస్తుత భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు కృషి ఫలితంగా చర్ల వైద్యశాలకు ఐదు పడకల డయాలసిస్ కేంద్రం కూడా మంజూరు కాగా.. రోజుకు 40 మందికి ఉచిత డయాలసిస్ సేవలనందించేందుకు మార్గం సుగుమమయ్యింది. అదే విధంగా గత భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ప్రతీక్ జైన్ రోగులకు రక్త పరీక్షలకు అవసరమైన పరికరాలను గిరిజన సంక్షేమ శాఖ ద్వారా సమకూర్చి గిరిజన ప్రాంతానికి వైద్య సేవలనందించే విషయంలోనూ తాను కూడా తన త్యాగనిరతిని నిరూపించుకున్నారు.

**ప్రస్తుత కలెక్టర్ దృష్టి**

ప్రస్తుత జిల్లా కలెక్టర్ జితేష్ వీ పాటిల్ కూడా ఏజెన్సీ ప్రాంత ప్రజలపై తన మమకారాన్ని ఎక్కుపెట్టారు. చర్ల ప్రభుత్వ వైద్యశాల సమస్యలను తెలుసుకున్న ఆయన వచ్చీ రాగానే వైద్యశాలలో అవసరమైన ఉన్న తీవ్రఫేజ్ విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు రూప కల్పన చేశారు. రూ.17 లక్షలు మంజూరు చేసి త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యాన్ని కల్పించారు. ప్రభుత్వ వైద్యశాలకు వచ్చే రోగులు, సహాయకులకు భోజన వసతి కల్పించేందుకు చర్యలు చేపట్టిన కలెక్టర్ పాటిల్.. డైట్ సెంటర్‌ను ఏర్పాటు చేయించడంతో పాటు వైద్యశాల నిత్యం పరిశుభ్రంగా ఉండాలన్న లక్ష్యంతో పారిశుద్ధ్యం సిబ్బంది ఏర్పాటుకు కూడా చర్యలు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ భవన నిర్మాణం కోసం రూ.10 కోట్ల విడుదలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వగా, అవి మంజూరు చేసి సీహెచ్‌సీకి పూర్తి స్థాయి క్యాడర్‌ను శాంక్షన్ చేస్తే ప్రజానీకానికి వైద్య సేవలు మరింత చేరువకానున్నాయి.

> **సేవలు మరింత చేరువయ్యేనా?**
>
> చర్ల వైద్యశాల వృద్ధికి కలెక్టర్లు, అధికారులు విశేష కృషి చేసినప్పటికీ, మరికొన్ని సమస్యలు పరిష్కారానికి ఎదురుచూస్తున్నాయి. ప్రస్తుత జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, మంత్రులు చర్లకు స్పెషలిస్టు వైద్య సేవలు, ప్రసూతి వైద్య సేవలు అందుబాటులోకి తీసుకు రావాల్సి ఉంది. ఈ విభాగాల కోసం స్థానికుల ఎదురుచూస్తున్నారు. చర్ల ప్రాంతంపై మరింతగా దృష్టిసారించి గిరిజనానికి పూర్తి వైద్యాన్ని దరి చేర్చాలని కోరుతున్నారు.

# జెండా దిమ్మెపై వివాదం



వివాదానికి కారణమైన పార్టీ జెండా దిమ్మె ఇదే..

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని వినాయకపురం గ్రామంలో ఓ పార్టీ జెండా దిమ్మె విషయంలో వివాదం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామంలోని ప్రధాన సెంటర్లో రహదారి పక్కనే ఉన్న దిమ్మెకు గడిచిన పదేళ్లుగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు గులాబీ రంగు వేసి వినియోగిస్తున్నారు. ఈ క్రమంలోనే తాజాగా బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకలు నేపథ్యంలో స్థానిక ఆ పార్టీ నాయకులు బిర్రం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం పార్టీ జెండా ఎగురవేసేందుకు గులాబీ రంగును తిరిగి వేయించారు. కాగా, ఇదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామ నాయకులు నల్లపు నరసింహారావు అభ్యంతరం వ్యక్తం చేసి, గులాబీ రంగుపై తెలుపు రంగు వేయించినట్లు బీఆర్ఎస్ నాయకులు ఆరోపిస్తున్నారు. దీంతో పార్టీ జెండా దిమ్మె వ్యవహారం రెండు పార్టీల నాయకుల మధ్య వివాదంగా మారింది. ఎన్నో ఏళ్లుగా ఉన్న బీఆర్ఎస్ పార్టీ దిమ్మెకు తెలుపు రంగు వేయించడం సరికాదని, ఇదీ రాజకీయ కక్ష సాధించే ప్రయత్నమని స్థానిక బీఆర్ఎస్ పార్టీ నాయకులు బిర్రం వెంకటేశ్వరరావు అన్నారు. అదే విధంగా దీనిపై కాంగ్రెస్ గ్రామ నాయకుడు మాట్లాడుతూ.. గతంలో తమ సొంత స్థలంలో వైఎస్సార్ సీపీ పార్టీ కోసం తామే జెండా దిమ్మెను నిర్మించామని, ఇదీ బీఆర్ఎస్ పార్టీ దిమ్మె కాదని అన్నారు.

# టోర్నీ విజేత 'చరణ్ లెవెన్'



విజేతలకు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు

దుమ్ముగూడెం: మండలంలోని దుమ్ముగూడెం వైద్యశాల క్రీడా మైదానంలో గత 25 రోజులుగా జరుగుతున్న చరణ్ మెమోరియల్ క్రికెట్ టోర్నీ విజేతగా చరణ్ లెవన్ టీం నిలిచింది. ఆదివారం భద్రాచలానికి చెందిన యువ లెవన్-చరణ్ లెవన్ మధ్యన ఫైనల్ పోరు జరుగగా.. చరణ్ లెవన్ టీం విజేతగా నిలిచింది. విజేతలకు భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ స్నేహితుడు కల్లూరి చరణ్ జ్ఞాపకార్థం క్రికెట్ టోర్నీ నిర్వహించి విజయవంతంగా ముగించడం అభినందనీయం అన్నారు. చరణ్ కుటుంబానికి అండగా ఉంటానని ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో టోర్నీ నిర్వహకులు తెల్లం హరికృష్ణ, కుంజా రఘు, కల్లూరి సుమన్, హేమంత్, రేసు శ్రీను, కాంగ్రెస్ నాయకులు లంకా శ్రీనివాసరావు, అన్నె సత్యనారయణమూర్తి, కుంజా శ్రీనివాసరావు, మట్టా శివాజీ, తోట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలతో మానసికోల్లాసం



క్యాంప్ ప్రారంభోత్సవంలో విద్యార్థులతో సీఐ నాగరాజు

భద్రాచలం: విద్యార్థులకు క్రీడలు మానసికోల్లాసానికి ఎంతగానో దోహదపడతాయని పట్టణ సీఐ నాగరాజు అన్నారు. ఆదివారం పట్టణంలోని భద్రాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో భద్రాచలం ఫుట్‌బాల్ క్లబ్ ఆధ్వర్యంలో సమ్మర్ ఉచిత కోచింగ్ క్యాంప్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూన.. వేసవి సెలవులలో విద్యార్థులు సమయం వృధా చేయకుండా క్యాంప్‌ను ఏర్పాటు చేయటం అభినందనీయమని అన్నారు. వేసవి కాలంలో వడ దెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలతో క్యాంప్‌ను కొనసాగించాలని నిర్వహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఫుట్‌బాల్ క్లబ్ నిర్వహకులు చలపతి, చందు, రవి, మీరా, మన్మథ, నాగార్జున, హరీష్, అశోక్, విద్యార్థులు పాల్గొన్నారు.

# పహల్గాం దాడికి నిరసన



భద్రాచలం: ర్యాలీ నిర్వహిస్తున్న కాలనీవాసులు



దమ్మపేటలో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

దమ్మపేట: కశ్మీర్‌లోని పహల్గాంలో పాకిస్తాన్ తీవ్రవాదులు చేసిన దాడిని నిరసిస్తూ, సీపీఐ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి సుంకిపాక ధర్మ మాట్లాడుతూ.. పహల్గంలో టూరిస్టులపై తీవ్రవాదులు జరిపిన దాడిని హేయమైన చర్యగా అభివర్ణించారు. పాకిస్తాన్ కవ్వింపు చర్యలకు భయపడేది లేదని, భారత్‌ను ధైర్యంగా ఎదుర్కొనే దమ్ములేని పాకిస్తాన్, పిరికిపంద కవ్వింపు చర్యలకు పాల్పడటం సమంజసం కాదన్నారు. దుర్ఘటనలో మృతి చెందిన టూరిస్టులకు పార్టీ తరపున నివాళుర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బత్తుల సాయి, యార్లగడ్డ మణికంఠ, రాము, లక్ష్మీనారాయణ, శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

**శాంతి ర్యాలీ..**

భద్రాచలం: కశ్మీర్‌లో జరిగిన ఉగ్రవాద దాడిని నిరసిస్తూ పట్టణంలోని శాంతి నగర్ కాలనీ వాసులు ఆదివారం శాంతి ర్యాలీని చేపట్టారు. కాలనీలోని శాంతి గణపతి ఆలయం నుంచి ఎన్టీఆర్ విగ్రహం వరకు, తిరిగి మళ్లీ ఆలయం వరకు ర్యాలీ జరిపారు. ఈ సందర్భంగా శత్రు దేశాలకు సద్బుద్ధి కలగాలని ఉగ్రవాదము సమూలంగా నశించాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, చిన్నారులు పాల్గొన్నారు.

### నేడు 'భూ భారతి'పై అవగాహన

దమ్మపేట: మండలంలోని మల్లారం రైతు వేదికలో భూ భారతి చట్టంపై నేడు(సోమవారం) అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు దమ్మపేట ఇన్‌చార్జ్ తహసీల్దార్ కె.వాణి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ హాజరవుతారని అన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి స్థానిక నాయకులు, మండల ప్రజలు, రైతులు హాజరు కావాలని కోరారు.

అశ్వారావుపేటరూరల్: భూ భారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పించేందుకు నేడు (సోమవారం) అశ్వారావుపేటలో సదస్సు ఏర్పాటు చేసినట్లు స్థానిక తహసీల్దార్ వనం కృష్ణ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. స్థానిక శ్రీశ్రీ కల్యాణ మండపంలో మధ్యాహ్నం 12గంటలకు నిర్వహించే ఈ సదస్సుకు జిల్లా కలెక్టర్ వి జితేష్‌వి పాటిల్, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ హాజరవుతారని అన్నారు. ఈ సదస్సుకు మండలంలోని రైతులు అధిక సంఖ్యలో హాజరై చట్టం గురించి తెలుసుకోవాలని కోరారు.

### రాజకీయ ఉనికి కోసమే సభ

అశ్వాపురం: ఇందిరమ్మ రాజ్యం, ప్రజా ప్రభుత్వానికి ప్రజలు మద్దతు పలుకుతుండటంతో రాజకీయంగా తమ ఉనికిని కాపాడుకునేందుకు బీఆర్ఎస్ పార్టీ ఎల్కతుర్తి సభ నిర్వహిస్తోందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య అన్నారు. అశ్వాపురంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో వైఫల్యంతోనే ప్రజలు కాంగ్రెస్ పార్టీని గెలిపించారన్నారు. బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ కొండను తవ్వి ఎలుకను పట్టినట్లుగా ఉందన్నారు.

### చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న జ్యోతి

చంద్రుగొండ: మండలంలోని రావికంపాడులో గిరిజనులపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోతు జ్యోతి డిమాండ్ చేశారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. సమావేశంలో నాయకులు తేజావత్ బాబు, స్వామి, బాణోత్ శ్రీను, రాంబాబు, సతీష్ పాల్గొన్నారు.

# ప్రతిపాదనలు విరమించుకోవాలి

మణుగూరుటౌన్: మణుగూరు ఓసీలో ప్రైవేట్ లోడర్, టిప్పర్లను ఉపసంహరించుకోవాలని ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ వై.రాంగోపాల్ ఆదివారం ఏరియా జీఎం దుర్గం రాంచందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మణుగూరు ఓసీలో ప్రైవేట్ లోడర్, టిప్పర్ల ద్వారా క్రషర్లలో బొగ్గు సరఫరా చేసేందుకు ప్రైవేట్ వారికి టెండర్లు ఆహ్వానించినట్లు తెలిసిందన్నారు. వెంటనే ఆ ప్రతిపాదనను విరమించుకుని సింగరేణియే పనులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో రామనర్సయ్య, మేకల ఈశ్వర్, పుల్లారావు, శ్రీనివాసరావు, గోలి గంగాధర్ రావు, ఆవుల నాగరాజు, ఆదర్ల సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

# శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి



మణుగూరురూరల్: క్రీడలను ప్రారంభిస్తున్న జీఎం దుర్గం రామచందర్

మణుగూరురూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని పీవీకాలనీ భద్రాద్రి స్టేడియంలో నిర్వహిస్తున్న ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏరియా జీఎం దుర్గం రామచందర్ తెలిపారు. ఈ వేసవి శిక్షణ శిబిరాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సింగరేణి ఉద్యోగుల బాలబాలికలకు మే 20వ తేదీ వరకు ఈ వేసవి శిక్షణ తరగతుల్లో ఫుట్‌బాల్, అథ్లెటిక్స్, బాస్కెట్ బాల్, కరాటే, విభాగాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏరియా డీజీఎం(పర్సనల్) ఎస్ రమేష్, డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ గౌరవ కార్యదర్శి పీటీ అవినాష్, ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు వి.కృష్ణంరాజు, సెక్యూరిటీ అధికారి కె.శ్రీనివాస్, అసిస్టెంట్ స్పోర్ట్స్ సూపర్‌వైజర్ జాన్ వెస్లీ, కోచ్‌లు, సింగరేణి ఉద్యోగుల బాలబాలికలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదకరంగా రహదారి



ములకపాడు- లక్ష్మీనగరం ప్రధాన రహదారిపై పేరుకుపోయిన మట్టి

దుమ్ముగూడెం: మండలంలోని ములకపాడు నుంచి లక్ష్మీనగరం వరకు భద్రాచలం-చర్ల ప్రధాన రహదారి ప్రమాదకరంగా మారింది. సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. ములకపాడు నుంచి లక్ష్మీనగరం వరకు ప్రధాన రహదారి మీద సుమారు ఐదు అడుగుల వెడల్పు వరకు మట్టి పేరుకుపోయి ప్రమాదకరంగా మారింది. అసలే మండలంలో ప్రధాన రహదారంతా గోతులమయంగా మారి తరచు ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనికితోడు రహదారి మంచిగా ఉన్న దగ్గర కూడా నిర్వహణ చేపట్టకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రహదారి మీద సుమారు ఐదు అడుగుల వెడల్పు మేర మట్టి దిబ్బలు పేరుకుపోయి ద్విచక్ర వాహనాలు అదుపు తప్పిపడి ప్రజలు గాయాలపాలువుతున్నారు.

ఆర్అండ్‌బి శాఖ అధికారులు నిర్లక్ష్యం వీడి రహదారిపై మట్టి తొలగించేందుకు చర్యలు చేపట్టాల్సిందిగా స్థానికులు కోరుతున్నారు.

# రజతోత్సవానికి కదిలిన బీఆర్ఎస్ శ్రేణులు

**బీఆర్ఎస్ పార్టీ 25 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో రజతోత్సవాలు ఏర్పాటు చేసిన సంగతి విధితమే. ఈ సభకు స్థానిక బీఆర్ఎస్ శ్రేణులు ఆదివారం భారీ ఎత్తున తరలివెళ్లారు. అంతకుముందు పార్టీ జెండాలు ఆవిష్కరించి వేడుక చేశారు.**

పినపాక: పినపాక మండలం నుంచి భారీ ఎత్తున నాయకులు, కార్యకర్తలు సభకు బయలుదేరగా.. పినపాక మాజీ ఎమ్మెల్యే జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు జెండా ఊపి వారి ప్రయాణాన్ని ప్రారంభించారు. అంతకుముందు ఆయా గ్రామపంచాయతీల్లో గ్రామ అధ్యక్షుడు బీఆర్ఎస్ జెండా ఆవిష్కరించి మిఠాయిలు పంచుకున్నారు.

దమ్మపేట: ముందుగా స్థానికంగా ఉన్న బీఆర్ఎస్ పార్టీ దిమ్మెల వద్ద మాజీ ఎమ్మెల్యేలు మెచ్చా నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు స్థానిక నాయకుల సమక్షంలో పార్టీ జెండాలను ఆవిష్కరించి జై తెలంగాణ, జై కేసీఆర్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం పార్టీ ఏర్పాటు చేసిన బస్సుల్లో కొందరు, కార్లలో మరికొందరు వరంగల్ సభకు బయలుదేరినారు. తరలిన వారిలో నాయకులు రావు జోగేశ్వరరావు, దారా యుగంధర్, దారా మల్లికార్జునరావు, దొడ్డా రమేష్, రావుల శ్రీను, జలగం వాసు, గాజుబోయిన యేసు, పాకనాటి శ్రీను ఉన్నారు.

గుండాల: బీఆర్ఎస్ రజతోత్సవ సభకు గుండాల, ఆళ్లపల్లి మండలాల నుంచి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆదివారం ప్రత్యేక బస్సుల్లో బయలుదేరారు.

చంద్రుగొండ/అన్నపురెడ్డిపల్లి: సభకు తరలివెళ్లేందుకు ముందుగా ప్రధాన సెంటర్‌లోని పార్టీ స్తూపం వద్ద బీఆర్ఎస్ నాయకులు జెండావిష్కరణ చేశారు. అయితే చంద్రుగొండ నుంచి వెళ్లేందుకు స్కూల్ బస్సులు ఏర్పాటు చేసుకోవడంతో అనుమతులు లేవని అధికారులు నిలిపివేశారు. దీంతో కార్లల్లో పార్టీ నాయకులు సభకు వెళ్లారు.

అశ్వాపురం: మండలంలో ఆదివారం బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. 24 గ్రామ పంచాయతీల్లో బీఆర్ఎస్ పార్టీ జెండాలు పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. రజతోత్సవాన్ని స్థానికంగా పండుగలా జరుపుకున్నారు. మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ పార్టీ జెండా ఆవిష్కరించారు.



చంద్రుగొండ: సభకు బయలుదేరి వెళ్తున్న బీఆర్ఎస్ శ్రేణులు



దమ్మపేట: గోపాలపురంలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే నాగేశ్వరరావు



గుండాల మండలం నుంచి వరంగల్‌కు తరలివెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు